




VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 56 | ఆదివారం 26 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## ఇది ప్రజాస్వామ్య విజయం: కేంద్ర మంత్రి రాజీనామా పై సోనమ్ వాంగ్‌చుక్

- వీధుల నుంచి పోరాడి సాధించుకున్న ఫలితమన్న వాంగ్‌చుక్
- భయం వీడి గళమెత్తిన పౌరులకు, దేశ యువతకు అభినందనలు
- బాధ్యతాయుత పాలన దాటి విద్యారంగ సంస్కరణల వైపు సాగాలని పిలుపు



2


## ఇరాన్‌కు ఆయుధాలు ఇస్తే నష్టం మీకే.. పుతిన్, జిన్‌పింగ్‌కు ట్రంప్ హెచ్చరిక

- ఇరాన్‌కు ఆయుధాలు అమ్మొద్దని ట్రంప్ హెచ్చరిక
- జిన్‌పింగ్, పుతిన్ హామీలను నమ్ముతున్నానని వ్యాఖ్య
- ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వబోమని ఇద్దరూ చెప్పారన్న ట్రంప్
- ఉక్రెయిన్‌కు నేరుగా ఆయుధాలు అమ్మడం లేదని ట్రంప్ స్పష్టీకరణ



2

## మీ ఆరోగ్యం... మీ బాధ్యత



2

- సంజీవనిని సద్వినియోగం చేసుకోండి
- ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నుంచి సంజీవని
- ప్రజారోగ్యం-ప్రజా సంక్షేమం-అభివృద్ధి కూటమి ప్రభుత్వ బాధ్యత
- గొడ్డలి పార్టీ నేతలు పగటి వేషగాళ్లు-ఒక్క ఎకరాకు నీరివ్వలేదు... ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు
- ఆస్పరిలో సంజీవని కార్యక్రమం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## క్యాంపస్‌లలో డ్రగ్స్ పై ఉక్కుపాదం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- విద్యాసంస్థల్లో డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ ఆదేశం
- క్యాంపస్‌లలో డ్రగ్స్ ఘటనలకు కాలేజీ యాజమాన్యాలదే బాధ్యత
- డ్రగ్స్ సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు, క్యూఆర్ కోడ్ల ఏర్పాటుకు సూచన
- అవసరమైతే డ్రగ్స్ నియంత్రణకు కొత్త చట్టం తీసుకురావాలని యోచన
- గుర్తించడం, చికిత్స, శిక్షించడం అనే మూడు దశల వ్యూహం అమలు

జులై 25 వార్త సాక్ష్యం

తెలంగాణలో మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కళాశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.



2

## తాగునీటి సమస్య పరిష్కారానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం



2

జులై 25 వార్త సాక్ష్యం

మిషన్ భగీరథ పై మంత్రి సీతక్క శనివారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలు రాకుండా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉందన్నారు. సింగూరు, పాలేరు నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజువారీ రిజర్వాయర్ల నీటిమట్టాలను సమీక్షించాలని సూచించారు. స్థానిక నీటి వనరులను వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

## ఏపీ తలుపుతట్టిన మరో 'బంగారు' అవకాశం.. చంద్రబాబు సొంత జిల్లాలో భారీ పసిడి నిక్షేపాలు!

- చిగురుగుంట-బి.సొనత్తం గనుల్లో 12,500 కిలోల బంగారం ఉన్నట్లు అంచనా
- ఈ-వేలంలో పాల్గొనడానికి ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ సన్నాహాలు
- వేలం లేకుండానే గనుల్ని కేటాయించాలని కేంద్రాన్ని కోరేందుకు ప్రభుత్వం కసరత్తు
- గతంలో నిలిచిపోయిన గనుల తవ్వకాలను పునఃప్రారంభించాలని సీఎం ఆదేశాలు



2

## 'దేశమే ముందు' అని ప్రశంస : బండి సంజయ్

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రశంసించిన బండి సంజయ్
- ఇది బీజేపీ 'దేశమే ముందు' అనే సిద్ధాంతానికి నిదర్శనమన్న కేంద్రమంత్రి
- పదవులు శాశ్వతం కాదని, ప్రజా విశ్వాసమే ముఖ్యమని వ్యాఖ్య

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. ఇది బీజేపీ అనుసరించే "దేశం మొదట, పార్టీ తర్వాత, వ్యక్తిగతం ఆఖరు" అనే మూల సిద్ధాంతానికి నిదర్శనమని ఆయన శనివారం పేర్కొన్నారు.



7

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఇరాన్‌కు ఆయుధాలు ఇస్తే నష్టం మీకే.. పుతిన్, జిన్‌పింగ్‌కు ట్రంప్ హెచ్చరిక

ఇరాన్‌కు చైనా, రష్యా ఎలాంటి ఆయుధాలు విక్రయించకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలా చేస్తే అది ఆ రెండు దేశాల ప్రయోజనాలకు మంచిది కాదని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం ఇరాన్‌కు ఆయా దేశాలు ఆయుధాలు అందించడం లేదని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. ఇరాన్‌కు చైనా, రష్యా లక్ష్యాన్ని నిర్ధారించుకునే సమాచారాన్ని అందిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మే నెలలో బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కలిసినప్పుడు "ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వం" అని ఆయన హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. తమ మధ్య ఉన్న సంబంధాల కారణంగా ఆ మాటను తాను విశ్వసిస్తున్నానన్నారు. ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్నప్పటికీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఇదే హామీ ఇచ్చారని ట్రంప్ వెల్లడించారు. తాను ఉక్రెయిన్‌కు నేరుగా ఆయుధాలు విక్రయించడం లేదని, నాటో దేశాలకు మాత్రమే అమ్ముతున్నానని చెప్పారు అవి తర్వాత ఎలా పంపిణీ అవుతున్నాయో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. తర్వాత మీడియాతో మాట్లాడిన ట్రంప్.. షీ జిన్‌పింగ్, పుతిన్ ఇద్దరూ ఇచ్చిన హామీలను తాను నమ్ముతున్నానని మరోసారి స్పష్టం చేశారు. తాను నిరాశ చెందేలా వారు వ్యవహరించరని భావిస్తున్నానని చెప్పారు. ప్రపంచంలోని ప్రధాన దేశాల నాయకులుగా వారిని గౌరవించాల్సిందేనని కూడా ట్రంప్ పేర్కొన్నారు.

## ఇది ప్రజాస్వామ్య విజయం: కేంద్ర మంత్రి రాజీనామా పై సోనమ్ వాంగ్‌చుక్

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా 'ప్రజాస్వామ్య విజయం'గా సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు. వీధుల నుంచి పోరాడి సాధించుకున్న ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఇది నిదర్శనమని చెప్పారు. శనివారం ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించిన వెంటనే వాంగ్‌చుక్ 'ఎక్స్' వేదికగా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి, ఓపిక, పట్టుదలకు దక్కిన ప్రతిఫలమిదని వాంగ్‌చుక్ ఆనందం వ్యక్తం చేశారు. "దేశంలోని ప్రతీ మూల నుంచి భయాన్ని వీడి, గళమెత్తిన పౌరులకు, జెన్-జీ యువతకు, సీజేపీకి నా అభినందనలు. బాధ్యతాయుత పాలన డిమాండ్ నుంచి మొదలైన ఈ పోరాటం, ఇప్పుడు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణల దిశగా అడుగులు వేయాలి" అని పేర్కొన్నారు. పరీక్షల అక్రమాలు, ప్రశ్న పత్రాల లీక్‌లపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ వాంగ్‌చుక్ 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, గత 10 రోజులుగా దేశంలో చోటుచేసుకున్న పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, పరీక్షల వివాదాన్ని దేశ వ్యతిరేక శక్తులు వాడుకోకుండా చూడటానికే తప్పుకుంటున్నానని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తన రాజీనామా లేఖను పంపారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయత కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ పరిణామంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ప్రజలు ఐక్యంగా ప్రశ్నిస్తే ఎంతటి ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని విద్యార్థి నాయకులు వ్యాఖ్యానించారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం

స్థానిక నీటి వనరులను వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులతో నీటి సరఫరాపై సమాచారం అందించాలని మంత్రి సూచనలు చేశారు. మహిళా సంఘాలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకూడదని మంత్రి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎల్‌నీనో పరిస్థితులు ఉన్నాయని.. ఆ ప్రభావం తెలంగాణ మీద కూడా ఉందని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అశ్రద్ధ, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాల కోసం వెచ్చించుకోవచ్చని తెలిపారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యం నివ్వాలని కేంద్రం గైడ్‌లైన్స్ కూడా ఇచ్చిందన్నారు. ఎక్కడైనా గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఏర్పడితే ఆర్థిక సంఘం నిధులతో మంచినీటిని సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తాగునీరు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉండొద్దన్నారు. పైప్ లీకేజీలు, రిపేర్ల కారణంగా ఏదైనా ఒక రోజు నీటిని సరఫరా చేయలేని పరిస్థితుల్లో.. గ్రామస్థులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా ప్రజలు సంసిద్ధంగా ఉంటారని చెప్పారు.

## క్యాంపస్‌లలో డ్రగ్స్ పై ఉక్కుపాదం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

తెలంగాణలో మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కళాశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. కళాశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, సంబంధిత యాజమాన్యాలనే బాధ్యులను చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో యాజమాన్యాలకు అధికారాలు కల్పించడంతో పాటు, వారిని బాధ్యులను కూడా చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రతి కళాశాలలో ఒక ప్రత్యేక విభాగాన్ని (సెల్) ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా, సులభంగా చేరవేసేందుకు విద్యాసంస్థల్లో టోల్-ఫ్రీ నంబర్లు, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. క్యాంపస్ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచేలా పటిష్ట వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. డ్రగ్స్ బారిన పడిన వారిని గుర్తించడం, వారిని డీ-ఎడిక్షన్ కేంద్రాలకు పంపడం, తదనంతరం నేరస్తులను కఠినంగా శిక్షించడం అనే మూడంచెల వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల కేసుల్లో పదేపదే నిందితులుగా మారుతున్న వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే మరిన్ని పటిష్టమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# మీ ఆరోగ్యం... మీ బాధ్యత







**కర్నూలు జూలై 25 వార్త సాక్ష్యం**

ప్రజారోగ్యం కోసమే సంజీవని పథకాన్ని అందిస్తున్నామని ఆగస్టు నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మీ ఆరోగ్యం... మీ చేతుల్లో ఉంటుందని... ప్రభుత్వం అందించే సంజీవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం సాంకేతికతను జోడిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న సంజీవని ప్రాజెక్ట్ ప్రత్యేకతలను సీఎం చంద్రబాబు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్య, వైద్యం మీదే ప్రతి కుటుంబం అత్యధికంగా ఖర్చు చేస్తున్న పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకునేలా సంజీవని ప్రాజెక్టును రూపొందించామని సీఎం తెలిపారు. ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు కానున్న ఈ కార్యక్రమంలో ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి.. కుటుంబ సభ్యులందరికీ ఆభా హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు.

**ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ ఇదే సంజీవని విధానం**

ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స ఇవ్వడమే కాదు.. వ్యాధులు రాక ముందే గుర్తించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అవసరమైనప్పుడు సమర్థవంతమైన వైద్యం అందించడమే సంజీవని లక్ష్యమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు వచ్చాయని అలాంటి పరిస్థితులను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నా మని పేర్కొన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు ఆరోగ్యం, బాలల ఆరోగ్య పరీక్షలు, 108 అత్యవసర సేవలు, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలను ఒకే డిజిటల్ వ్యవస్థలోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, డిజిటల్ నర్వ్ సెంటర్లను సంజీవనిలో భాగం చేస్తామని సీఎం తెలిపారు. సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్ ద్వారా ప్రజలు వైద్యుల అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ ఆరోగ్య రికార్డులను ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేయడం ఒక్కటే సరిపోదని.. ప్రజల్లో కూడా ఆరోగ్య చైతన్యం పెరగాలని సీఎం సూచించారు. మంచి ఆహారం, యోగా, ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన కుటుంబం.. ఆరోగ్యవంతమైన గ్రామం.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు.. ప్రతీ కుటుంబానికి అండగా ప్రభుత్వం**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని.. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి మద్దతు, స్త్రీశక్తి ద్వారా మహిళల సాధికారత, దీపం-2.0 ద్వారా గ్యాస్ సబ్సిడీ, ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో గందరగోళం సృష్టించి వివాదాలకు కారణమయ్యారని సీఎం విమర్శించారు. రీసర్వే ద్వారా అన్ని భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని.. రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కర్నూలు-బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

**వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిన నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జల ధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెంచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఏళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు. కర్నూలు జిల్లాలో రూ.1,768 కోట్లతో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు పెట్టలేదని.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శించారు. ఒక్క ఎకరాకు కొత్తగా నీళ్లు ఇవ్వలేదని.. ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. డ్రిప్ సబ్సిడీలు ఎత్తేసినవారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నం పెడుతుంటే గత పాలకులు సహించలేక పోయారని... గత పాలకులు రాష్ట్రంలో ప్రతీ వ్యవస్థను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. గొడ్డలి పార్టీ నేతలను.. వారు చేసే మోసపూరిత రాజకీయాలను విశ్వసించ వద్దని ముఖ్యమంత్రి కోరారు.

**పరదాలు కట్టడం లేదు... చెట్లు నరకడం లేదు**

సంజీవని కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ అనంతరం అదే వేదిక మీద నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికార యంత్రాంగం పనితీరును సమీక్షించారు. శాఖల మంచి పనితీరు కనపరిచిన అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పం తీసుకుని పనిచేస్తున్నామని క్షేత్ర స్థాయి వరకూ అంతా సమర్థంగా పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలమని అన్నారు. ఇప్పటి వరకు తాను 50 బహిరంగ సభల్లో ఇదే విధంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును ప్రజలకు వివరించానని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా అధికార యంత్రాంగంతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో దిగారు. కర్నూలు జిల్లాలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేశారు. ప్రసంగిస్తున్న సమయంలో వినతిపత్రాలు ఇచ్చేందుకు కొందరు ప్రయత్నించటంతో సభ ముగిసిన అనంతరం వాటిని తీసుకుంటానని సీఎం వారికి వివరించారు. తాను ప్రజలందరినీ కలుస్తానని.. గత పాలకుల లాగా పరదాలు కట్టుకుని తిరగటం లేదని, చెట్లను నరికించి సమావేశాలు పెట్టటం లేదని సీఎం వ్యాఖ్యానించారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని.. ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని చెప్పారు. అందుకే ప్రతి నెలా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుంటూ... వాటికి పరిష్కారంగా ప్రజా విధానాలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానిక కూటమి పార్టీల నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ తలుపుతట్టిన మరో 'బంగారు' అవకాశం.. చంద్రబాబు సొంత జిల్లాలో భారీ పసిడి నిక్షేపాలు

ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ 'బంగారు' అవకాశం తలుపుతట్టింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖనిజ సంపద వెలికితీతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనుల తవ్వకాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా అయిన చిత్తూరులో భారీ బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ గనులను దక్కించుకుని, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ద్వారానే బంగారం వెలికితీయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలం చిగురుగుంట-బి.సానత్తం ప్రాంతంలోని గనుల్లో సుమారు 22 లక్షల టన్నుల బంగారు ఖనిజం ఉన్నట్లు అంచనా. నిపుణుల లెక్కల ప్రకారం.. ఒక టన్ను ఖనిజాన్ని శుద్ధి చేస్తే 5.64 గ్రాముల బంగారం లభించే అవకాశం ఉంది. ఈ లెక్కన మొత్తం ఖనిజం నుంచి ఏకంగా 12,500 కిలోల (12.5 టన్నుల) బంగారం వెలికితీయవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఈ గనులను ఏపీఎండీసీకే దక్కేలా చూడాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏపీఎండీసీ ఈ గనుల కోసం నిర్వహించే ఈ-వేలంలో పాల్గొనడానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ.37 కోట్ల బ్యాంకు గ్యారెంటీని కూడా సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. జులై నెలాఖరులోగా బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. మరోవైపు వేలం ప్రక్రియ లేకుండానే ఈ గనులను నేరుగా ఏపీఎండీసీకి కేటాయించాలని కేంద్రాన్ని కోరేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల తెలంగాణలోని సింగరేణికి రెండు బొగ్గు గనులను, ఒడిశాలో బాక్సైట్ లీజును కేంద్రం వేలం లేకుండానే కేటాయించింది. ఇదే పద్ధతిలో తమకు కూడా చిగురుగుంట గనులతో పాటు రామగిరి, రొద్దం, జవకుల గనులను కేటాయించాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించనుంది. గతంలో ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిగినా, పెరిగిన రవాణా ఖర్చులు, అప్పట్లో బంగారం ధరలు తక్కువగా ఉండటంతో 2000 సంవత్సరంలో గనులను మూసివేశారు. 2018లో జరిగిన వేలంలో ఎన్ఎండీసీ గనులను దక్కించుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులతో ముందుకు సాగలేకపోయింది. చివరికి ఎన్ఎండీసీ వెనక్కి తగ్గడంతో ఇప్పుడు ఈ గనులను దక్కించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమమైంది. వేలంలో గనులు దక్కితే, మరో సంస్థతో కలిసి తవ్వకాలు చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 26 జూలై 2026

## న్యాయవాదుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-టిడిపి లీగల్ సెల్ ప్రముఖ న్యాయవాది తులసి రెడ్డి






నంద్యాల జులై 25 వార్త సాక్ష్యం

నంద్యాల తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కార్యాలయం నందు శనివారం టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. న్యాయవాదులు తులసి రెడ్డి, ఖలీల్ , హుస్సేన్ భాష, సాయిరాం రాయల్ లు మాట్లాడుతూ కొంతమంది న్యాయవాద మిత్రులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే వెళ్లి పరామర్శిస్తూ కూటమి ప్రభుత్వం ఏమి చేయలేదా అని అనడం తగదని అన్నారు . నంద్యాలలో ఇంత పెద్ద కోర్టు కాంప్లెక్స్ భవనాలు వచ్చాయంటే దానికి గతంలో తెలుగుదేశం నాయకులు ఏరాసు ప్రతాప్ రెడ్డి చేసిన కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు. ఆనాడు ప్రభుత్వం నుండి సుమారు 18 నుండి 20 కోట్ల రూపాయల నిధులను తెప్పించి, ఎంతో శ్రమకోర్చి ఈ భవనాలను నిర్మించడం జరిగిందని, ఈ విషయాన్ని న్యాయవాదులు గుర్తుంచుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత న్యాయశాఖ మంత్రి ఫరూక్ గారి చొరవతో నంద్యాలలో 4 కొత్త కోర్టులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు . ఈ కోర్టులను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్ , జస్టిస్ శ్రీనివాసరెడ్డి గారితో పాటు మరో ఇద్దరు జడ్జీలు విచ్చేసి ఎంతో ఘనంగా ప్రారంభించారని తెలిపారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ బెంచ్ ఏర్పాటు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని, ఇది త్వరలోనే అందుబాటులోకి రానుందని తెలిపారు. దీనివల్ల చిత్తూరు, అనంతపురం, కడప, నెల్లూరు, ఒంగోలు వంటి దాదాపు 8 జిల్లాల ప్రజలకు, కక్షిదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, విజయవాడ వరకు వెళ్లే శ్రమ తప్పుతుందని వివరించారు. ఈ ప్రక్రియను న్యాయశాఖ మంత్రి ఫరూక్ మరియు లా సెక్రటరీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు . వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) గత ప్రభుత్వ హయాంలో కోర్టు బార్ అసోసియేషన్ పక్కన కాంపౌండ్ వాల్ (గోడ) కూలిపోతే, దానిని కనీసం మరమ్మతు చేయడానికి కూడా పైసా నిధులు ఇవ్వలేదని తులసి రెడ్డి విమర్శించారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 6 నెలల కాలంలోనే ఆ కాంపౌండ్ వాల్‌ను నిర్మించి చూపించామని అన్నారు . గత ప్రభుత్వం న్యాయవాదుల కోసం ఒక్క 10 రూపాయలైనా వెచ్చించిందా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో 'లా నేస్తం' పథకం కింద కేవలం 5 వేల రూపాయలు ఇస్తూ, 10 మందికి ఇచ్చి 100 మందికి ఇస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం ప్రకారం జూనియర్ న్యాయవాదులకు 10,000 రూపాయల స్టైఫండ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని, దీనికి సంబంధించిన ఫైల్ ప్రస్తుతం లా సెక్రటరీ పరిశీలనలో ఉందని, త్వరలోనే న్యాయవాదులకు ఈ స్టైఫండ్ అందుతుందని భరోసా ఇచ్చారు. అలాగే ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో ఏ న్యాయవాది అయినా మరణిస్తే, వారి కుటుంబాలకు లీగల్ సెల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అటెస్టేషన్‌తో స్టేట్ బార్ కౌన్సిల్‌కు దరఖాస్తులు పంపి, ప్రభుత్వం నుండి మరియు బార్ కౌన్సిల్ నుండి ఆర్థిక సహాయం అందేలా చూస్తున్నామని వివరించారు. న్యాయవాద మిత్రులంతా వాస్తవాలను గ్రహించాలని, కొందరు రాజకీయ స్వార్థం కోసం, వైసిపి ట్రాప్‌లో పడి చేస్తున్న ఆరోపణలను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో, మంచి మనస్సుతో న్యాయవాదులందరి సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు .ఈ సమావేశంలో లీగల్ సెల్ ప్రతినిధులు గౌరీ శంకర్, ప్రతాపరెడ్డి, మహమ్మద్, పిట్టల హనీఫ్ , ప్రముఖ న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థిని ,విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించండి





-సింగల్ విండో చైర్మన్ ఎ.ష హబుద్దీన్.

ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ శ్రీశైలం నియోజకవర్గం క్రీడలు శుక్రవారం ప్రారంభించారు నంద్యాల జిల్లా క్రీడా అధికారి ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, మండల టిడిపి సీనియర్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సీనియర్ నాయకులు పఠాన్ నాగూర్ ఖాన్, గిరిజన జాతి ముద్దుబిడ్డ కరివేన టిడిపి నాయకులు రవి నాయక్ కోయ హోటల్ మున్న ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్. లు పాల్గొన్నారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నైపుణాన్ని ప్రదర్శించి నియోజక వర్గానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా, నిమ్మి కృష్ణ యాదవ్, , క్రీడ శిక్షకులు ప్రభాకర్, మహబూబ్, అసదుల్లా, సతీష్, చంద్రమోహన్, బద్రుజమ తదితరులు పాల్గొన్నారూ



# వర్షాబావ పరిస్థితుల్లో పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలి





-ఆత్మకూరు మండల వ్యవసాయ శాఖ అధికారిని కె. హేమలత

ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

రైతన్నలు కరీఫ్ సీజన్లో సాగు చేస్తున్న పంటలను వర్షా బావ పరిస్థితులతో కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆత్మకూరు మండల వ్యవసాయ శాఖ అధికారిని కె .హేమలత పేర్కొన్నారు శనివారం మండల పరిధిలోని నల్ల కాలువ గ్రామంలో రైతుల పంట పొలాలను సందర్శించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మండల వ్యవసాయ శాఖ అధికారిని మాట్లాడుతూ సాగు చేస్తున్న మొక్కజొన్న ,పత్తి , సోయాచిక్కుడు పంట పొలాలను సందర్శించడం జరిగింది , మొక్కజొన్న పంటలో తేమ సంరక్షణ మరియు కలుపు నివారణ కొరకు అంతర కృషి చేయాలని అలాగే నీటి ఎద్దడి తట్టుకోవడానికి 2% యూరియా అనగా 20 గ్రాములు యూరియా లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు పత్తి పంటలో బెట్టపరిస్థితుల నివారణ కొరకు 13-0-45 లేదా 19.19.19 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి చేసుకోవాలని పత్తి పంటలో మెగ్నీషియం దాతు లోపాన్ని గమనించడం జరిగింది దీని నివారణకు 5 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అలాగే పత్తి పంటలో పూత ,పిందె రాలడం గమనించడం జరిగింది . దీని నివారణకు బోరాను రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా మండలంలోని రైతులు మొక్కజొన్న పత్తి సాగు చేసిన రైతులు పంటల బీమా చేసుకోవాలని ఈనెల 31.వ తేదీ లోపు రైతులందరూ తప్పకుండా భీమా చేసుకోవాలని తెలిపారు ఎలినినో ప్రభావం ఆగస్టు మరియు సెప్టెంబర్ లో అధికంగా ఉంటుంది కావున విత్తనం వేయని రైతులు వరి మొక్కజొన్న వంటి పంటలు వేసుకోకుండా తక్కువ నీటితో పండే పంటలను మినుము, పెసర ,జొన్న, ప్రొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని తెలియజేశారు కార్యక్రమంలో వ్యవసాయ వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ కుమార్ గ్రామ వ్యవసాయ సహాయకురాలు పార్వతి బాయ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు

# విబిజి రాంజీ పథకం కింద ఒకే రోజు 1,000 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం



-49 వేల హెక్టార్ల నుంచి లక్ష హెక్టార్లకు ఉద్యాన పంటల విస్తరణ

-రైతులకు మూడేళ్లపాటు ప్రభుత్వ అండ - స్థిరమైన ఆదాయమే ప్రభుత్వ లక్ష్యం

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జూలై 25 వార్త సాక్ష్యం

రైతులకు స్థిరమైన ఆదాయం, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం గడివేముల మండలం కొరటమద్ది గ్రామంలో ఒకే రోజు 1,000 ఎకరాల్లో పండ్ల తోటల పెంపక కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విబిజి రాంజీ (వీబీజీ,ఆర్ ఎం జి ) పథకం కింద పండ్ల తోటల పెంపక కార్యక్రమాన్ని ప్రారంభిచామన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 49,000 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని, వాటి విస్తీర్ణాన్ని లక్ష హెక్టార్లకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల వైపు అడుగులు వేయాలని సూచించారు. కొబ్బరి, నారింజ, మామిడి, జామ, సీతాఫలం, జీడిమామిడి వంటి సంప్రదాయ పండ్లతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర్, యాపిల్ వంటి అధిక ఆదాయాన్ని అందించే పంటలను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. త్వరలో నంద్యాలలో పండించిన యాపిల్స్ కూడా మార్కెట్‌లోకి



రానున్నాయని పేర్కొన్నారు.విబిజి రాంజీ పథకం ద్వారా గుంతలు తవ్వడం, మొక్కల సరఫరా, ఎరువులు, నీటి వసతి, సస్యరక్షణ వంటి అన్ని అంశాలకు ప్రభుత్వం మూడు సంవత్సరాలపాటు సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. పావు ఎకరం నుంచి 2.5 ఎకరాల వరకు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులందరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ శ్రామికులు, రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి పథకం అమలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మొక్కల సంరక్షణ తదితర అంశాలపై వివరించారు ఈ సందర్భంగా ఒక మహిళా రైతు కొబ్బరి తోట సాగు గురించి వివరించగా, మొక్కల కొనుగోలు నుంచి వాటి సంరక్షణ వరకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, ఒకవేళ రైతులు స్వయంగా కొనుగోలు చేసినా వ్యయాన్ని ప్రభుత్వం తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. మూడు సంవత్సరాలపాటు మొక్కల సంరక్షణ కోసం ఉపాధి హామీ మస్టర్ల ద్వారా నెలకు సుమారు రూ. 2,200 నుంచి రూ. 2,300 వరకు భృతి అందించడంతో పాటు మొత్తం రూ. 1.15 లక్షల వరకు ప్రభుత్వ సహాయం లభిస్తుందని కలెక్టర్ వివరించారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మిశ్రమ పంటలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు కలిపి సుమారు 30 రకాల విత్తనాలను చల్లే విధానాన్ని పాటించడం వల్ల నేలలో తేమ నిలిచి పంట దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు.



గ్రామంలో పింఛన్లకు సంబంధించిన సమస్యలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒకే రేషన్ కార్డుపై ఉన్న అర్హులలో ఒకరికి మాత్రమే పింఛన్ అందుతున్నట్లయితే నిబంధనల ప్రకారం కార్డులను వేరు చేసి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేస్తేనే రోజుకు రూ.312 పూర్తి వేతనం లభిస్తుందని కలెక్టర్ ఉపాధి హామీ శ్రామికులకు వివరించారు. సాంకేతిక సహాయకులు సూచించిన కొలతల ప్రకారం పనులు చేయకపోతే కూలీలు రోజుకు రూ.40 నుంచి రూ.50 వరకు నష్టపోతున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు 2.5 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నందున ఈ నష్టం సంవత్సరానికి దాదాపు రూ.100 కోట్ల వరకు చేరుతోందన్నారు. ప్రతి శ్రామికుడు పూర్తి స్థాయిలో పని చేసి ప్రభుత్వ కల్పిస్తున్న పూర్తి వేతనాన్ని పొందాలని కలెక్టర్ తెలిపారు. వేసవి కాలంలో పశువుల నుంచి మొక్కలను రక్షిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో తోటలను సంరక్షించి ఉద్యాన సాగును లాభదాయకంగా మలుచుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులు, సాంకేతిక సహాయకులు, రైతులు, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంజీవని ద్వారా ఇంటిశీటికి ఆరోగ్య రక్షణ





**-41 రకాల పరీక్షలు ఉచితం.. రూ.3 వేల వరకు ఖర్చు ఆదా**
**-వ్యాధి నిర్ధారణ నుంచి మందులు, పైస్థాయి వైద్యం, నిరంతర పర్యవేక్షణ వరకు ఒకే వ్యవస్థ**
**-సీఎం చంద్రబాబు నేతృత్వశీలో రాష్ట్రం పురోగతి**
**-ఆస్పరి సభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

కర్నూలు జులై 25 వార్త సాక్ష్యం

జబ్బు వచ్చిన తర్వాత ఆసుపత్రిలో చికిత్స చేయడానికే పరిమితమైన వైద్య విధానాన్ని మార్చి.. ప్రజలు అనారోగ్యం బారిన పడకముందే ముప్పును గుర్తించి కాపాడే సమగ్ర ఆరోగ్య వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల ఇళ్ల వద్దకే సంచార వైద్య వాహనాలను పంపి ఆరోగ్య పరీక్షలు చేయడం నుంచి.. అవసరమైన వారికి ఉన్నత వైద్యం అందించి, కోలుకునే వరకు పర్యవేక్షించడం వరకు 'సంజీవని' ద్వారా ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటు ందని చెప్పారు.కర్నూలు జిల్లా ఆస్పరిలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో సంజీవని కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని పేర్కొన్నారు.

**-ఒక్క పరీక్షతో ఆగదు**

సంజీవని కింద ప్రజలకు ఇంటి సమీపంలోనే ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని మంత్రి వెల్లడించారు. బయట చేయించుకుంటే సుమారు రూ.3 వేల వరకు ఖర్చయ్యే 41 రకాల పరీక్షలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. తొలిఏడాది అదన శీగా 200 కోట్ల వరకు ప్రభుత్వశీపై భారం పడుతుందని చెప్పారు మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్‌తోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తిస్తారని చెప్పారు. పరీక్షల ఫలితాలను బట్టి ఆరోగ్యంగా ఉన్నవారు, తక్కువ ముప్పు, మధ్యస్థ ముప్పు, అధిక ముప్పు ఉన్నవారిగా వర్గీకరిస్తారని వివరించారు.వ్యాధి ముప్పు ఉన్నవారిని పై ఆసుపత్రికి పంపడంతో ప్రభుత్వ బాధ్యత ముగియదన్నారు. సంబంధిత వైద్యుడి వద్ద అపాయింట్‌మెంట్ ఖరారు చేయడం, అవసరమైన పరీక్షలు చేయించడం, మందులు అందించడం, చికిత్స సక్రమంగా కొనసాగుతోందో లేదో పర్యవేక్షించడం వరకు సంజీవని ద్వారా చర్యలు చేపడతామని తెలిపారు.

**-ప్రతి పౌరుడికీ డిజిటల్ ఆరోగ్య చరిత్ర**

రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తామని మంత్రిబ చెప్పారు. గ్రామ ఆరోగ్య కేంద్రం నుంచి బోధనాసుపత్రి వరకు రోగి ఆరోగ్య చరిత్ర వైద్యులకు అందుబాటులో ఉండేలా వ్యవస్థను అనుసంధానిస్తామన్నారు.ఒక ఆసుపత్రిలో చేసిన పరీక్షలను మరోచోట మళ్లీ చేయాల్సిన అవసరం లేకుండా, రోగికి ఎక్కడా వైద్య సేవలు ఆగకుండా సంజీవని వేదిక పనిచేస్తుందని తెలిపారు. ముందస్తు పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ అన్నీ ఒకే గొలుసులో కొనసాగుతాయని వివరించారు.

**-చిన్నారులకు ముందస్తు రక్షణ**

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో జాప్యం అనే నాలుగు ప్రధాన సమస్యలను గుర్తిస్తామన్నారు. చిన్నారులు భవిష్యత్తులో 46 రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశాన్ని ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరోగ్య సమస్య తీవ్రం అయ్యాక చికిత్స చేయడం కన్నా.. చిన్న వయసులోనే గుర్తించి నివారించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**-ప్రభుత్వ ఆసుపత్రులపై పెరిగిన నమ్మకం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వైద్యుల నియామకం, ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, అవసరమైన వైద్య పరికరాల సమకూర్పుతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపడ్డాయన్నారు.వైద్యులు అందుబాటులోకి రావడంతో ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం పెరిగిందని చెప్పారు. గత రెండేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయటి రోగుల సంఖ్య 25 నుంచి 28 శాతం వరకు పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను చికిత్స ఆధారిత విధానం నుంచి ముందస్తు నివారణ, నిరంతర ఆరోగ్య సంరక్షణ విధానంలోకి తీసుకెళ్లడమే



సంజీవని లక్ష్యమని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమం దేశానికే కాకుండా ప్రపంచానికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**-అభివృద్ధి.. సంక్షేమం రెండూ కొనసాగిస్తున్నాం**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమాంతరంగా కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగావకాశాల కల్పనతోపాటు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, సామాజిక భద్రతా పింఛన్లు, ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, నేతన్నలకు ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు.రాయలసీమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, కర్నూలు జిల్లాకు పెట్టుబడులు, మౌలిక వసతులు వస్తున్నాయని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**-ఉచిత ప్రయాణంతో ఆసుపత్రులకు చేరువైన మహిళలు**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కేవలం రవాణా పథకం మాత్రమే కాదని మంత్రి పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చు భయంతో గతంలో పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేకపోయిన మహిళలు ఇప్పుడు ఉచితంగా వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు.మహిళలకు ప్రయాణ స్వేచ్ఛతోపాటు ఆర్థిక వెసులుబాటు లభిస్తోందన్నారు. ఒక మహిళ ఆరోగ్యంగా, ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటే ఆ కుటుంబం, సమాజం, రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారు.

**-ఆస్పరిలో 35 వేల మందికి ఆరోగ్య కవచం**

వెనుకబడిన రాయలసీమ ప్రాంతమైన ఆస్పరి నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించడం ఈ ప్రాంతంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుమారు 35 వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ప్రతి ఒక్కరికీ డిజిటల్ ఆరోగ్య వివరాలు నమోదు చేస్తామని చెప్పారు. వ్యాధి ముప్పు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన ఆసుపత్రికి పంపడంతోపాటు చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షిస్తామన్నారు. ప్రజలకు దూరంగా పరదాలు, బారికేడ్ల మధ్య కాకుండా వారి మధ్యకు వచ్చి, ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు

# త్రివిక్రముడి సన్నిధిలో బాలకొండమ్మ



చెరుకూరు జులై 25 వార్త సాక్ష్యం

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చీరాల శాసనసభ్యులు శ్రీ మద్దులూరి మాలకొండయ్య సతీమణి బాలకొండమ్మ కుటుంబ సమేతంగా చెరుకూరులోని శ్రీ త్రివిక్రమ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలతో ఆశీర్వదించారు.ఈ సందర్భంగా బాలకొండమ్మ గారు మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన స్వామివారిని దర్శించి పూజల్లో పాల్గొన్న ప్రతి భక్తుడిపై స్వామివారి కటాక్షం ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు.అదే సందర్భంగా శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కొమ్మనబోయిన రజనీ గారు కూడా కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో త్రివిక్రమ స్వామి చెరుకూరు దేవస్థానం ఈవో నాగేశ్వరరావు , ప్యాక్స్ చైర్మన్ పాలేటి కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి

రెంటచింతల



ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని రెంటచింతల తహసీల్దార్ మర్రి దీప్తి తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత నెల 13వ తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ వరకు మండలంలోని 11 గ్రామాలు, 50 పోలింగ్ కేంద్రాలు, 132 వార్డుల్లో ప్రత్యేక సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు.సర్వేలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న వారందరూ వాటిని తిరిగి సమర్పించడంతో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. మండలంలో మొత్తం 40,674 మంది ఓటర్లు నమోదై ఉన్నారని పేర్కొన్నారు.ప్రాథమిక పరిశీలనలో 1,367 మంది మృతిచెందిన ఓటర్లు, 1,775 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 684 మందికి రెండు చోట్ల ఓటు నమోదు ఉండగా, 774 మంది తమ వివరాలు అందించలేదని తెలిపారు. మొత్తంగా సుమారు 4,600 మంది ఓటర్ల వివరాల్లో మార్పులు అవసరమని గుర్తించినట్లు చెప్పారు.ఈ నెల 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, అనంతరం వచ్చే నెల 30వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పబ్లిక్ డేటా ఎంట్రీ సేవలు సద్వినియోగం చేసుకోండి

**-డిజిటల్ విధానంతో సులభంగా ఆస్తుల క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు**
**-ఆత్మకూరు సబ్ రిజిస్టర్ అబ్దుల్ కరీం**



ఆత్మకూరు జులై 25 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ సేవలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు మరింత సులభతరంగా జరుగుతున్నాయని ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం తెలిపారు. శనివారం మీడియా ప్రకటన విడుదల చేశారు.దస్తావేజు లేఖరుల రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే సెంటర్లు) నిర్వహిస్తున్న ఆందోళనల నేపథ్యంలో కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ తాడేపల్లి ఆదేశాల మేరకు ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ప్రజలు నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా దస్తావేజులను సిద్ధం చేసుకుని యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనే దస్తావేజుల తయారీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి వెంటనే నమోదు చేసిన పత్రాలను ప్రింట్ రూపంలో అందజేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా వేగవంతంగా సాగుతోందని తెలిపారు.పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఆస్తుల క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలని ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం" ముగింపు




ఆత్మకూరు జులై 25 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొట్టాల చెరువు లో శనివారంవైద్యాధికారి డాక్టర్ ఉమేరా సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కొట్టాల చెరువు ప్రాథమిక వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడంతోనే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఇంటిలో మరియు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నిల్వ ఉన్న నీటిలో దోమ లార్వా పెరగకుండా చూడాలని, దోమకాటు నుండి రక్షించుకోవడానికి దోమతెరలు వాడాలని సూచించారు. జ్వరం సోకిన వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకుని వ్యాధి నిర్ధారణ తర్వాత పూర్తిగా ఉచితంగా మందులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది స్టాఫ్ నర్స్ అనిత, ఫార్మసిస్ట్ స్వరూప, ఆరోగ్య కార్యకర్త బి. విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు

## సమ్మెతో సేవలకు ఆటంకం లేదు

**-సబ్ రిజిస్టర్ పి శ్రీనివాసరావు**

బాపట్ల జులై 25 వార్త సాక్ష్యం



డాక్యుమెంట్ రైటర్ల సమ్మె కొనసాగుతున్నప్పటికీ జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నాయని బాపట్ల జిల్లా రిజిస్ట్రార్ పి. శ్రీనివాసరావు తెలిపారు.ఐజీ ఆదేశాల మేరకు జిల్లాలోని 12 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు నేరుగా సేవలు అందిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సమ్మె ప్రభావం జిల్లాలోని రిజిస్ట్రేషన్ సేవలపై లేదని స్పష్టం చేశారు.సమ్మె ప్రారంభానికి ముందే ప్రజలు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవడంతో బాపట్ల జిల్లా 155 శాతం పనితీరును నమోదు చేసి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, నేరుగా సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను సంప్రదించి తమ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# సత్రశాలలో ఆధ్యాత్మిక శోభ



రెంటచింతలజులై 25 వార్త సాక్ష్యం

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లాలోని కృష్ణానది తీరం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సత్రశాలలోని శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా "ఓం నమఃశివాయ" నామస్మరణతో మార్మోగి భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. వేకువజాము నుంచే పల్నాడు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా చేరుకున్నారు. కృష్ణానదిలో ఏర్పాటు చేసిన జల్లు స్నానం భక్తులకు ఉపశమనం కలిగించడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ పూజారి శర్మ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య, ఎండోమెంట్స్ ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు.భక్తులకు వెన్నా వెంకటేశ్వరరెడ్డి దంపతులు లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేయగా, విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ కె. వెంకటరమణ, ఈఈ గోదావరి శ్రీనివాస్, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ సేవలందించారు.అయితే మాచర్ల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో అనేక మంది భక్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ఏడాది తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి రూ.23,916 ఆదాయం రాగా, ఈ ఏడాది భక్తుల విరాళాలు, దర్శనాల ద్వారా రూ.31,502 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# రాములవారిని దర్శించిన ఎమ్మెల్యే ఏలూరి



మార్టూరు జులై 25 వార్త సాక్ష్యం

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మార్టూరు మండలం కోనంకి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, పర్చూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని శ్రీ సీతారామచంద్రస్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# త్రివిక్రమ స్వామి ఆలయంలో అన్నప్రసాదం



చెరుకూరు జులై 25 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ స్వామి, శ్రీ అగస్తీశ్వర స్వామి దేవస్థానాల్లో నిత్య ధార్మిక సేవలను మరింత విస్తరించేందుకు అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు నిర్ణయించారు.ఈ నిర్ణయం మేరకు శ్రీ త్రివిక్రమ స్వామి దేవస్థానంలో ప్రతి ఏకాదశి రోజున, శ్రీ అగస్తీశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి మాస శివరాత్రి సందర్భంగా భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.అందులో భాగంగా తొలి ఏకాదశి సందర్భంగా శుక్రవారం శ్రీ త్రివిక్రమ స్వామి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించి దేవస్థానం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.దేవాదాయ శాఖ ఆదేశాలకు అనుగుణంగా భక్తులకు ఆధ్యాత్మిక సేవలతో పాటు అన్నదాన సేవను నిరంతరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

# సగం కొబ్బరి కాయ కోసం కొలను భారతి దేవి అమ్మవారి పరువు తీస్తారా







-ఆలయ పర్యవేక్షణలో శ్రీశైల దేవస్థానం అధికారుల నిర్లక్ష్య ధోరణి
-పేరుకే దత్తత...కనిపించని అధికారుల జాడ
-కొలను భారతి దేవస్థానంలో పూజలు చేయించాలంటే... 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే
-అమ్మవారి క్షేత్రంలో జరిగిన వేళంలో విచిత్రమైన సంఘటనలు
-భక్తులకు అందించే అక్షరాభ్యాసం వస్తువులు, టెంకాయలు, అక్షింతలు వేలంలో అన్ని హక్కులు మావే
-అమ్మవారికి చేసే పూజ కార్యక్రమంలో సగం టెంకాయ.. భక్తులకు.. సగం టెంకాయ పూజారికి ఎందుకు ఇస్తామంటూ వివాదాస్పదం
-ఓ శాఖ అధికారి అక్కడికి వెళ్లి అమ్మవారి క్షేత్రంలో చర్చించినట్లు సమాచారం

ఆత్మకూరు జులై 25 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా నల్లమల అటవి ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన ఏకైక కొలను భారతి ఆలయం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది.సరస్వతి అమ్మవారు స్వయంభుగా వెలువడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకోవడానికి ఇక్కడికి వేలాదిమందిగా తరలి వస్తూ ఉంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో బాసర పుణ్యక్షేత్రం తెలంగాణకు వెళ్లిపోవడంతో ఆంధ్రప్రదేశ్ లోని ఏకైక సరస్వతి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు ఇటీవల కూటమి ప్రభుత్వం శ్రీశైలం దేవస్థానం దత్తత తీసుకోవాలని సూచించడంతో ఆలయ అధికారులు అట్టహాసంగా దత్తత స్వీకారాన్ని తీసుకొని అనంతరం వచ్చిన వసంత పంచమి వేడుకలను( అమ్మవారి జన్మదినాన్ని ) ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత ఆలయం వైపు దేవస్థానం అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి కులం భారతి అమ్మవారి క్షేత్రంలో సగం టెంకాయ కోసం పూజార్ల మధ్య వేలం దారుల మధ్య వివాదాస్పదమైన సంఘటనలు నెలకున్నట్లు సమాచారం ఈ విషయం పై ఓ శాఖ అధికారి కులం భారతి క్షేత్రంలో సగం టెంకాయ వేలం పాడిన వాళ్లకే ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు విశ్వనీయ వర్గాల సమాచారం భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకొని అమ్మ పిల్లలకు అక్షరాభ్యాసం చేసేందుకు కావలసిన పూజా సామ్రాగిణి ఆలయ ప్రాంగణంలో ప్రతి భక్తుడు కొనుగోలు చేసే విధంగా దేవస్థానం ఆధ్వర్యంలో వేలంపాట జరగడం అందరికీ తెలిసిన విషయమే అయితే అమ్మవారి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయను ప్రసాదంగా భావించే భక్తాదులు పూజారి చేతుల మీదుగా సగం కొబ్బరికాయ అమ్మవారి చెంత ఉంచి సగంకొబ్బరికాయ భక్తులకు ఇవ్వడం అందరికీ తెలిసిన విషయమే అయితే అమ్మవారికి ప్రతిరోజు పూజలు నిర్వహించే పూజారికి సగం కొబ్బరికాయ నీకు ఎందుకు ఇవ్వాలంటూ వివాదాస్పదం మారినట్లు మరో సమాచారం టెంకాయ కోసం అమ్మవారి పవిత్రతను కాపాడాల్సిన ఆలయ అధికారులు కనుచూపుమేరా కనిపించడం శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయమైన కొలను భారతి దేవస్థానం నల్లమల అడవి ప్రాంతంలో ఉండడం ఇక్కడి నుండి శ్రీశైలానికి సుమారు 150 కిలోమీటర్లు ఉండడం, దేవస్థానానికి సంబంధించి ఇక్కడ అధికారులు ఎవరూ లేకపోవడం పూజలు చేసుకోవాలంటే అధికారుల అనుమతుల కోసం గంటల తరబడి ప్రయాణం భక్తాదులు కొనసాగించాల్సి వస్తుంది అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు విలువైన కానుకలు, పట్టు చీరలు, నగదు కానుకలు హుండీ లో వేస్తూ ఉంటారు. స్థానికంగా అధికారులు లేకపోవడంతో వీటి పైన భక్తులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అర్చకులు స్వీపర్లు మాత్రమే ఉండడంతో దేవస్థానం పై పలు విమర్శలు వెలువడుతున్నాయి శ్రీశైల దేవస్థానం దత్తతకు తీసుకున్న తర్వాత ఇక్కడ వసతి గృహాలు భక్తులకు మెరుగైన సేవలు అందుతాయని ఆశించిన భక్తులకు నిరాశ ఎదురవుతుంది ఎంతో మహిమాన్వితమైన కొలనుభారతి అమ్మవారి దగ్గర హోమాలు, కుంకుమార్చన,తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు పూజ కైంకర్యాలు చేయించుకుంటే తమకు మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం అలాంటప్పుడు దేవస్థానం ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి పూజలకు సంబంధించిన రుసుముల బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా దేవస్థానానికి ఆ డబ్బులు చెల్లించి భక్తులు తమ పూజలు నిర్వహిం చుకునే వెసులుబాటును దేవస్థానం అధికారులు కలిగిస్తే దేవస్థానానికి ఆదాయం, ఇలాంటి విమర్శలు వినిపించావు కదా అని భక్తులు పేర్కొంటున్నారు. గత రెండు నెలల క్రితం దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ప్రైవేటు హోమాల గురించి శ్రీశైల దేవస్థానం ఈవో విచారణ అధికారిని ఏర్పాటు చేయగా అతను విచారించి నివేదిక సమర్పించారు. అయితే ఇందులో భాగంగా దేవస్థానం కొలనుభారతి ఆలయంలో పనిచేసే ఇద్దరు స్వీపర్లపై చర్యలు తీసుకోవడంపై కొండను తవ్వి ఎలకను పట్టుకున్న చందంగా మారిందని విమర్శలు వినిపిశీచయి. ఏది ఏమైనాప్పటికీ అమ్మవారి క్షేత్రంలో సగం కొబ్బరికాయ కోసం వివాదాస్పదంగా మారడంతో భక్తుల్లో నిరాశ గురవుతుందని చెప్పవచ్చు ఇప్పటికైనా సగం కొబ్బరికాయ విషయంలో శ్రీశైలం దేవస్థానం అధికార యంత్రాంగం స్పందిస్తుందా లేదా అనే విషయాన్ని వేచి చూద్దాం

# కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భారీ దొంగతనం










-ఆలస్యంగా తెలుగులోకి వచ్చిన డీజిల్ కడ్డీల దొంగతనాల హాట్ టాపిక్
-లీటర్ల కొద్దిడీజిల్..టన్నుల కడ్డీలు దొంగిలించినట్లు సమాచారం
-రహస్యంగా విచారణ చేపట్టిన సంబంధించిన శాఖ అధికారులు
-వాటాల పంపకాలలో తేడాలు రావడంతో బట్టబయలు
-అసలైన సూత్రధారులను తప్పించే ప్రయత్నంలో అధికార యంత్రాంగం
-దొంగతనాలకు అడ్డాగా మారిన నంద్యాల - కల్వకుర్తి జాతీయ రహదారి అభివృద్ధి పనులు
-తెలుగు గంగ అభివృద్ధి పనులకు లీటర్ల కొద్ది డీజిల్ పంపినట్లు సమాచారం
-ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన అధికారులు
-గ్రామీణ ప్రాంతాలలో యువకులనే టార్గెట్ చేసిన ఆ పార్టీ నేతలు
-కొత్తపల్లి మండలంలో సంచలనంగా మారిన జాతీయ రహదారి దొంగతనాలు

ఆత్మకూరు జులై 25 వార్త సాక్ష్యం

రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల మధ్య జరుగుతున్న 167కే జాతీయ రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల మధ్యలో దేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానానికి భక్తులకు ప్రయాణం తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం దాదాపు 2000 వేల కోట్ల రూపాయలతో జాతీయ రహదారి పనులు గత సంవత్సరం నుంచి ప్రారంభించింది ఈ జాతీయ రహదారి పనులు తెలంగాణ రాష్ట్రంలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంద్యాల వరకు ఈ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి అయితే ఈ అభివృద్ధి పనులు జరిగే క్రమంలో ఆ పార్టీ నేతల కనుసైగల్లో కొందరు యువకులను రహదారి అభివృద్ధి పనుల్లో నియమించినట్లు సమాచారం శనివారం కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భారీగా దొంగతనం జరిగినట్లు ప్రజల్లో తీవ్రమైన చర్చలు కొనసాగుతున్నాయి ఈ నేపథ్యంలోనే లక్షల కొద్ది డీజిల్, టన్నులకొద్ది కడ్డీలు దొంగలు తీసుకెళ్లినట్లు అధికార యంత్రాంగం అప్రమత్తమై రహస్యంగా విచారణ చేపట్టినట్లు విశ్వనీయ వర్గాల సమాచారం ఈ విషయం గుట్టు చప్పిడిగా బయటికి రానివ్వకుండా రహస్య అన్వేషణ ప్రారంభించారు అధికారులు చేపట్టిన ఈ అన్వేషన్లో రాత్రివేళ సమయంలో అక్రమంగా తోలుతున్న డీజిల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం ఆ పార్టీకి చెందిన నాయకుల కను సైగల్లో గ్రామీణ ప్రాంతాల యువకులను టార్గెట్ చేసి తప్పు ఒకరి చేస్తే మరొకరిపై తప్పు చేసినట్లు గ్రామీణ ప్రాంత ప్రజలు చర్చించుకోవడం మరో విశేషంగా మారింది జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో గతంలో విజయవాడ -కర్నూలు 340 సి జాతీయ పనుల్లో కూడా దొంగతనం జరిగినట్లు విశ్వనీయ వర్గాల సమాచారం అదే తరహాలోనే మళ్లీ ఇంత పెద్ద భారీ దొంగతనం జరగడం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కొత్తపల్లి మండలమంతా ఈ విషయం హాట్ టాపిక్ గా మారిందని చెప్పవచ్చు డీజిల్ దొరకని సమయంలో ఆ వాహనం ద్వారా తెలుగుంగా అభివృద్ధి పనుల్లో జరుగుతున్న కొన్ని టిప్పర్ల వాహనాలకు జాతీయ అభివృద్ధి పనులకు సంబంధించిన డీజల్ ను వాడినట్లు సమాచారం టన్నులకొద్దీ కడ్డీలను అమ్మకాలు జరిపిన అధికారులు పట్టుకుంటారా లేక చూసి చూడనట్లు ఆ పార్టీ నేతలకే కుమ్మక్కోస్తారా అనే విషయాన్ని వేచి చూద్దాం..!? వాటాల పంపకాలలో తేడాలు రావడంతో ఈ విషయం బయటికి రావడంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు కథలు కథలుగా, ఈ విషయాన్ని చర్చించుకోవడం జరుగుతుంది

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 26 జూలై 2026

# 'గ్రీన్ గుంటూరు--నవ గుంటూరు'కు శ్రీకారం

-పార్లమెంట్ పరిధిలో 1.20 లక్షల మొక్కల లక్ష్యం
-ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జరిమానాలు
-రూ.500 కోట్ల తాగునీటి ప్రాజెక్టుకు నాంది

గుంటూరు,జులై 25 వార్త సాక్ష్యం

గుంటూరును హరిత, పరిశుభ్ర, ఆధునిక నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నగరపాలక సంస్థ 'గ్రీన్ గుంటూరు--నవ గుంటూరు' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పార్లమెంట్ పరిధిలో 1.20 లక్షల మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు జియో ట్యాగింగ్, ట్రీగార్డుల ఏర్పాటు చేపట్టనున్నారు. ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జరిమానాలు అమలు చేయడంతో పాటు రూ.500 కోట్ల తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగరాన్ని పచ్చదనం, పరిశుభ్రత, ఆధునిక మౌలిక వసతులతో దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు 'గ్రీన్ గుంటూరు--నవ గుంటూరు' కార్యక్రమాలను శనివారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శిల్పారామం సమీపంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పాటు పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2047 నాటికి దేశంలో గ్రీన్ కవర్‌ను 50 శాతానికి పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా గుంటూరులో విస్తృత స్థాయిలో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు ప్రాంతంలో గ్రీన్ కవర్ కేవలం 7.2 శాతం మాత్రమే ఉండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో మొత్తం 1.20 లక్షల మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించామని, వాటిలో 90 వేల మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి జియో ట్యాగింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, రోడ్లపై చెత్త వేయడంపై జరిమానాలు విధించనున్నట్లు మంత్రి ప్రకటించారు. 'వెల్త్ ఫ్రమ్ వేస్ట్' విధానంలో చెత్తతో తయారుచేసిన కంపోస్ట్‌ను మొక్కలకు వినియోగిస్తున్నామని తెలిపారు. ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయడం, గోడలపై అందమైన చిత్రాలు వేయించడం, స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గుంటూరులో రాబోయే 30 ఏళ్ల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.500 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పచ్చదనం వంటి మౌలిక వసతులను మెరుగుపరచి గుంటూరును వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ గ్రీన్ గుంటూరు కార్యక్రమానికి భాష్యం విద్యాసంస్థల తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తమ విద్యాసంస్థల్లోని 27 వేల మంది విద్యార్థులతో ఒక్కొక్క మొక్కను దత్తత తీసుకుని జియో ట్యాగింగ్ ద్వారా సంరక్షించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు.



నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ మాట్లాడుతూ గుంటూరును స్మార్ట్, క్లీన్, క్లైమేట్ రెసిలియంట్ సిటీగా తీర్చిదిద్దడమే 'నవ గుంటూరు' కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రధాన రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్, చెరువుల వద్ద బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టనున్నామని, కార్పొరేషన్ తరఫున అదనంగా 5 వేల మొక్కలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్‌ను నియమించి పచ్చదన పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో సేవలందించిన పలువురిని సన్మానించడంతో పాటు పెయింటింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరస్కరణకు గురైన ఓటర్ల దరఖాస్తులపై విచారణ

-అర్హులందరికీ ఓటరు నమోదు కల్పిస్తాం: కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు జులై 25 వార్త సాక్ష్యం

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా సమర్పించకపోవడం లేదా అవసరమైన వివరాలు అందించకపోవడం వల్ల తిరస్కరణకు గురైన దరఖాస్తులను విచారణ చేసి, అర్హులైన వారికి ఓటరుగా నమోదు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ తొలి దశ పూర్తయిందని, ప్రస్తుతం ఓటరు జాబితాలో మ్యాప్ కాని ఓటర్ల వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ కొనసాగుతోందన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు ఓటరు జాబితాలో దాదాపు లక్ష వరకు ఉన్నట్లు గుర్తించామని, నిబంధనల ప్రకారం వాటిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.సమావేశంలో



జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గుంటూరు, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారులు కె. శ్రీనివాసరావు, కె. శ్రీరమణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్, జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజర్ లక్ష్మీకుమారి, ఎస్ఎస్ఏ పీఓ పద్మావతి, కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ, జనసేన, ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గవర్నర్‌కు ఘన స్వాగతం గవర్నర్ అబ్దుల్ నజీర్ కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ





-వ్యవసాయ కళాశాలలో వైభవంగా స్నాతకోత్సవం
-పట్టభద్రులతో కళకళలాడిన బాపట్ల క్యాంపస్..

బాపట్ల

బాపట్ల సూర్యలంక రోడ్డులోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో 58వ వార్షిక స్నాతకోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. బాపట్ల ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాపట్ల సూర్యలంక రోడ్డులోని వ్యవసాయ కళాశాల డాక్టర్ బి.వి. నాథ్ ఆడిటోరియంలో 58వ వార్షిక స్నాతకోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు ఘన స్వాగతం పలికి సభా ప్రాంగణానికి ఆహ్వానించారు. అనంతరం ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్య, వ్యవసాయ పరిశోధనలు, రైతు సంక్షేమానికి విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. స్నాతకోత్సవం సందర్భంగా పట్టభద్రులకు డిగ్రీలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ స్వర్ణ పతకాలు ప్రదానం చేయనున్నారు.

## కార్గిల్ వీరుల త్యాగానికి వందనం



బాపట్ల జులై 25 వార్త సాక్ష్యం

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు బాపట్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వద్ద మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించే వేడుకలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అమర జవాన్ల స్మారక స్థూపానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించనున్నారు. బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలను స్మరించుకుంటూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులకు నివాళులర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలోని మాజీ సైనికులు, దేశభక్తులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్గిల్ విజయ్ దివస్ దేశభక్తిని చాటిచెప్పే చారిత్రక సందర్భంగా దేశవ్యాప్తంగా అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జిల్లా ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సురక్షిత నీటి సరఫరా అందించడమే లక్ష్యం



పూండ్ల జులై 25 వార్త సాక్ష్యం

పూండ్ల గ్రామ ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా రక్షిత నీటి సరఫరా పథకాన్ని రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) చీఫ్ ఇంజనీర్ ఆర్. సురేష్ శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామంలోని మంచినీటి చెరువు, ఫిల్టర్ బెడ్‌లు, పంప్ హౌస్‌ను పరిశీలించిన ఆయన, నిరుపయోగంగా ఉన్న మైక్రో వాటర్ ఫిల్టర్‌ను తక్షణమే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.మైక్రో వాటర్ ఫిల్టర్ పునరుద్ధరణకు అవసరమైతే జల్ జీవన్ మిషన్ నిధులను వినియోగించాలని, అలాగే పాడైపోయిన ఫిల్టర్ బెడ్‌లను పునరుద్ధరించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి అంచనాలు సిద్ధం చేసి అందుబాటులో ఉన్న నిధులతో వెంటనే పనులు ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టి గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో బాపట్ల జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏ.ఎస్. అనంతరాజు, ఎంపీడీవో బి. బాబురావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో, పూండ్ల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి పల్నాటి శ్రీరాములు, అసిస్టెంట్ ఇంజనీర్లు మంజూరు బాషా, యేసయ్య, స్వర్ణ, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏకలవ్యుని ఆదర్శం యువతకు స్ఫూర్తి

బాపట్ల జులై 25 వార్త సాక్ష్యం



గురుభక్తి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన శ్రీ ఏకలవ్యుని ఆదర్శాలను నేటి యువత అనుసరించాలని బాపట్ల తహసీల్దార్ ఎస్.కె. సలీమా పిలుపు నిచ్చారు.బాపట్ల పాత బస్టాండ్ సమీపంలోని ఎంఈఓ కార్యాలయం పక్కన నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకుల ఆధ్వర్యంలో తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ ఏకలవ్య మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఎస్.కె. సలీమా ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువుపై అచంచలమైన భక్తి, క్రమశిక్షణ, త్యాగానికి ఏకలవ్యుడు చిరస్మరణీయమైన ప్రతీక అని పేర్కొన్నారు. గురుదక్షిణగా తన బొటనవేలును ద్రోణాచార్యునికి సమర్పించిన ఏకలవ్యుని త్యాగం భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని సంపాదించిందన్నారు. నీతి, నిజాయితీ, గురుభక్తి వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ఏకలవ్యుని జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బాపట్ల జిల్లా చైర్మన్ నారాయణ బట్టు, శ్రీమన్నారాయణ, బాబు పూరి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఆవుల వెంకటేశ్వరరావు, ప్రసాద్ రెడ్డి, నవనీతం, జిల్లా ట్రైబల్ శాఖ సిబ్బంది, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, న్యాయవాదులు సాంబశివరావు, ప్రసాద్‌రావు, జోషి శ్రీనివాసరావు, రత్తయ్య, ట్రైబల్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## 'దేశమే ముందు' అని ప్రశంస : బండి సంజయ్

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. ఇది బీజేపీ అనుసరించే "దేశం మొదట, పార్టీ తర్వాత, వ్యక్తిగతం ఆఖరు" అనే మూల సిద్ధాంతానికి నిదర్శనమని ఆయన శనివారం పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే అత్యంత కీలకమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థి ఉద్యమ నేత స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతల వరకు ధర్మేంద్ర ప్రధాన్ దశాబ్దాలుగా దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల గొంతుకను వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడమేనని బండి సంజయ్ వివరించారు. క్లిష్ట సమయాల్లో బాధ్యతను స్వీకరించే ధైర్యం ప్రదర్శించడమే నిజమైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురైన అవకతవకలపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో, ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఆయన నైతిక విలువలకు నిదర్శనమని కొనియాడారు. నీట్-యూజీ సహా పలు పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణల పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. ఈ పరిణామాల మధ్యే ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన రాజీనామా లేఖను సమర్పించారు. కాగా, ఇది ప్రజాస్వామ్య పోరాట ఫలితమని, యువత ఉద్యమానికి లభించిన విజయమని ప్రతిపక్ష నేతలు అభివర్ణిస్తున్నారు.

## టెక్ దిగ్గజాలపై EU జరిమానాలు.. ట్రంప్ ఆగ్రహం, టారిఫ్‌ల హెచ్చరిక

జులై 25:
అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ కంపెనీలపై వరుసగా భారీ జరిమానాలు విధిస్తున్న యూరోపియన్ యూనియన్ వైఖరిపై యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలను చట్టవిరుద్ధమైనవి.. తీవ్రమైన వివక్షతో కూడుకున్నవని అభివర్ణించిన ఆయన, ఈయుపై 'సెక్షన్ 301' కింద వాణిజ్య విచారణ ప్రారంభిస్తామని, త్వరలోనే భారీ స్థాయిలో టారిఫ్‌లు (దిగుమతి సుంకాలు) విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' లో ఈ మేరకు సుదీర్ఘ పోస్ట్ చేశారు.ఎటువంటి బలమైన కారణం లేకుండానే యాపిల్ పై 15 బిలియన్ డాలర్లు, మెటా పై 3 బిలియన్ డాలర్లు, అమెజాన్ పై 2.5 బిలియన్ డాలర్ల చొప్పున ఈయూ జరిమానాలు విధించిందని ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా గూగుల్ పై మరో 1 బిలియన్ డాలర్ల (సుమారు 890 మిలియన్ యూరోలు) జరిమానా విధించినట్లు సమాచారం అందిందని, దీంతో గూగుల్‌పై ఈయూ విధించిన మొత్తం జరిమానాలు 18 బిలియన్ డాలర్లకు పైగా దాటాయని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




**-అమెరికా 'పిగ్గీబ్యాంక్' కాదు**

అమెరికన్ వ్యాపారాలను, పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఐరోపా దేశాలు తమ సొంత అవసరాల కోసం 'పిగ్గీబ్యాంక్' (ఉచిత నిధి) లాగా వాడుకోవడానికి ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ట్రంప్ హెచ్చరించారు. బైడెన్ హయాంలో మొదలైన ఈ దోపిడీ ధోరణిని తమ ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు.సెక్షన్ 301 విచారణ అంటే? అమెరికా ట్రేడ్ యాక్ట్ పరిధిలోని 'సెక్షన్ 301' ప్రకారం.. అమెరికన్ వ్యాపార ప్రయోజనాలకు భంగం కలిగించేలా లేదా వివక్ష పూరితంగా వ్యవహరించే విదేశీ వాణిజ్య విధానాలపై విచారణ జరిపే అధికారం యుఎస్ ప్రభుత్వానికి ఉంటుంది. విచారణ అనంతరం ఆయా దేశాలు లేదా కూటముల పై ప్రతీకారంగా భారీ టారిఫ్‌లు, వ్యాపార నిబం ధనలు విధించేందుకు ఇది మార్గం సుగమం చేస్తుంది.

## లారస్ లాభంలో 126 శాతం వృద్ధి

హైదరాబాద్ :
లారస్ ల్యాబ్స్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం ఏకంగా 126 శాతం వృద్ధితో రూ.368 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.163 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 29 శాతం వృద్ధితో రూ.1,570 కోట్ల నుంచి రూ.2,026 కోట్లకు చేరుకుంది. అఫర్డబుల్ మెడిసిన్స్ పోర్టుఫోలియో (జెనరిక్స్) విభాగం మంచి పనితీరును కనబరచటంతో పాటు, సీడీఎంఓలో వాణిజ్యపరమైన డెలివరీలు పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. జూన్ త్రైమాసికంలో సీడీఎంఓ విభాగం ఆదాయాలు 67 శాతం వృద్ధితో రూ.522 కోట్ల నుంచి రూ.870 కోట్లకు పెరగగా.. జెనరిక్స్ విభాగం ఆదాయం రూ.1.048 కోట్ల నుంచి రూ.1,156 కోట్లకు పెరిగింది. కాగా ఈ కాలంలో ఆర్ అండ్ డీ పెట్టుబడులు రూ.118 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. వైజాగ్ ప్లాంట్‌లో ఏపీఐ,ఫెర్మెంటేషన్ సామర్థ్యాలను పెంచేందుకు పెట్టుబడులను కొనసాగించనున్నట్లు వెల్లడించింది.




## షమీని ఎవ్వరూ పట్టించుకోని స్థితికి తీసుకొచ్చారు: క్రిస్ శ్రీకాంత్

ఇంటర్నెట్ డెస్క్:
భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ విషయంలో జట్టు యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఒకప్పుడు భారత బౌలింగ్ దళానికి ప్రధాన అస్త్రంగా నిలిచిన షమీని ఇప్పుడు పూర్తిగా పక్కన పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోందని మండిపడ్డాడు. రానున్న వన్డే ప్రపంచ కప్ 2027కు భారత జట్టులో చోటు దక్కే ప్లేయర్ల గురించి చర్చిస్తున్న సందర్భంలో శ్రీకాంత్ ఈ వ్యాఖ్యలు చేశాడు.ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, మొహ్సిన్ ఖాన్.. వీరంతా మంచి బౌలర్లు. ప్రపంచ కప్ టోర్నీకి ఇంకా 15 నెలల సమయం ఉంది. ఈ యువ ప్లేయర్లకు ఇప్పుడే పక్కన పెట్టలేం. కానీ షమీ అసాధారణ బౌలర్. అతడిని టీమ్ మేనేజ్‌మెంట్ ఎవ్వరూ పట్టించుకోని స్థితికి తీసుకొచ్చింది. ఇది నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది' అని క్రిస్ శ్రీకాంత్ వెల్లడించాడు. 2023 వన్డే ప్రపంచ కప్‌లో 24 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన షమీ.. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ ఏ సిరీస్‌కూ ఎంపిక కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.




**-బుమ్రా ఉంటేనే..**

2027 ప్రపంచ కప్‌లో భారత్ విజయావకాశాలు పూర్తిగా జస్ప్రీత్ బుమ్రా పైనే ఆధారపడి ఉంటాయని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. 'బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. అతడు భారత క్రికెట్‌కు దొరికిన అమూల్యమైన వజ్రం. బుమ్రా ఉంటేనే భారత్ ప్రపంచ కప్ గెలిచే అవకాశం ఉంటుంది. అతడు లేకపోతే మిగతా బౌలర్లతో అది చాలా కష్టం. అయితే దక్షిణాఫ్రికా పిచ్‌లపై ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ కూడా కీలక పాత్ర పోషించగలరు. అర్షదీప్ సింగ్‌కు తొలి రెండు ఓవర్లలో బంతి స్వింగ్ అయ్యే వరకు మాత్రమే ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత అతడు పెద్దగా ప్రభావం చూపలేడు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో కూడా తొలి ఓవర్ అద్భుతంగా వేసినా.. ఆ తర్వాత బ్యాటర్లు అతడిపై పూర్తిగా ఆధిపత్యం చెలాయించారు. అందుకే అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌కు సరిపోడు' అని క్రిస్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

## వైభవ్ సూర్యవంశీకి బౌలింగ్‌లో కూడా శిక్షణ- కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్:
భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దేందుకు భారత యాజమాన్యం సిద్ధమైనట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో రెండో టీ20కి ముందు బౌలింగ్ కోచ్ సునీల్ జోషి వైభవ్ భవిష్యత్తు గురించి మాట్లాడాడు. జింబాబ్వేతో తొలి టీ20లో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి చరిత్ర సృష్టించిన వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుతం అతడి బ్యాటింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టామని, అవకాశం వస్తే బౌలింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపాడు.ముందుగా వైభవ్ బ్యాటింగ్‌ను మెచ్చుకోవాలి. అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. అండర్ 19 ప్రపంచ కప్ ఫైనల్స్ నుంచి ఈ మైదానం అతడికి బాగా కలిసొచ్చింది. ప్రశాంతంగా, సునాయాసంగా పరుగులు సాధిస్తున్నాడు. బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' లో అతడి బౌలింగ్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. అతడు బౌలింగ్‌లోనూ కుదురుకుంటే జట్టుకు మరింత ప్రయోజనకరంగా మారుతాడు' అని సునీల్ జోషి తెలిపాడు.




**-సూర్యాంశ్ షెడ్గేపై ఒత్తిడి వద్దు**

యువ సీమ్ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేను హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలతో పోల్చడం సరికాదని జోషి స్పష్టం చేశాడు. 'అంతర్జాతీయ స్థాయికి అలవాటు పడేందుకు యువ ఆటగాళ్లకు కొంత సమయం పడుతుంది. సూర్యాంశ్ ఇప్పుడిప్పుడే భారత జట్టులో తన స్థానాన్ని స్థిరపరుచుకుంటున్నాడు. అతడిలోని ప్రతిభను నమ్మి అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్ష్ దూబె వంటి ప్లేయర్లకు బౌలింగ్ చేసే సామర్థ్యం ఉంది. ధారాళంగా పరుగులు ఇవ్వకుండా నియంత్రణతో బౌలింగ్‌లో చేసేలా వారితో నిరంతరం చర్చిస్తున్నాం' అని జోషి వెల్లడించాడు.

# క్రీడలు

## కామన్వెల్త్ గేమ్స్: భారత్‌కు తొలి పతకం
## ఝుండూ కుమార్‌కు మోదీ అభినందనలు




ఇంటర్నెట్ డెస్క్:
గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. బిహార్‌కు చెందిన పారా అథ్లెట్ ఝుండూ కుమార్ భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. పురుషుల హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కాగా ఈ విజయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అతడికి అభినందనలు తెలిపారు.'కామన్వెల్త్ గేమ్స్ 2026లో హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన ఝుండూ కుమార్ ప్రదర్శన అద్భుతం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు. అపారమైన శక్తి, సంకల్పం, ఎన్నో ఏళ్ల క్రమశిక్షణతో కూడిన సాధనకు ఈ విజయం నిదర్శనం. ఎదురైన అన్ని సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను నిలబెట్టారు. ఆయన విజయం కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తుంది' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ పోటీలో 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ.. 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయసంగా ఎత్తిన అతడు.. రెండో ప్రయత్నంలో 190 కిలోలను లిఫ్ట్ చేశాడు. కానీ చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నైజీరియాకు చెందిన రిలువాన్ ఇద్రిస్ 132.8 పాయింట్లతో స్వర్ణ పతకం కైవసం చేసుకోగా, ఇంగ్లండ్‌కు చెందిన మాథ్యూ హార్డింగ్ 131.0కిలోలతో రజత పతకం దక్కించుకున్నాడు. కేవలం 0.1కిలో తేడాతో ఝుండూ రజత పతకాన్ని చేజార్చుకోవడం గమనార్హం.



## మంచి పాత్రల కోసమే వేచి చూస్తున్నా పెళ్లికి కూడా తొందరలేదు: నిధి అగర్వాల్

సినిమా అవకాశాల కోసం తాను ఎప్పుడూ తొందరపడనని... జీవితంలో సినిమాలైనా, పెళ్లయినా దేనికీ హడావుడి పడేది లేదని నటి నిధి అగర్వాల్ స్పష్టం చేసింది. మంచి కథలు, అర్థవంతమైన పాత్రల కోసమే తాను వేచి చూస్తున్నానని తెలిపింది. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' చిత్రాల తర్వాత తమిళంలో మళ్లీ నటించకపోవడానికి సరైన ప్రాజెక్ట్ రాకపోవడమే కారణమని చెప్పింది. నటనకు ప్రాధాన్యం ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్యానించింది.పవన్ కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు', ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాల్లో నటించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు నిధి తెలిపింది. ప్రస్తుతం తెలుగు, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్లే తమిళ సినిమాలకు కాస్త దూరమయ్యానని పేర్కొంది. వృత్తిపరంగా తాను ఎంతో కష్టపడతానని, అయితే మిగతా విషయాల్లో చాలా సోమరినని సరదాగా వ్యాఖ్యానించింది. అలాగే తనది చాలా సున్నితమైన మనస్తత్వమని, అందుకే భావోద్వేగాలను బయటకు చూపించనని తెలిపింది. ప్రస్తుతం మరో రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తానని నిధి చెప్పింది. ఇకపోతే ఆమె త్వరలోనే 'మిరాయ్' పార్ట్-2తో పాటు హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్' చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'కాన్ సిటీ' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

తమిళంలో అర్జున్ దాస్ కి మంచి క్రేజ్ ఉంది. తెలుగులోను ఆయన నటనకీ .. వాయిస్ కి ఫ్యాన్స్ ఉన్నారు. అలాంటి అర్జున్ దాస్ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'కాన్ సిటీ'. హరీశ్ దురై రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, అన్నా బెన్ .. యోగిబాబు .. వడివుక్కరసు కీలకమైన పాత్రలను పోషించారు. జూన్ 26వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులో ఉంది.శరవణన్ (అర్జున్ దాస్) ఓ ప్రభుత్వ ఉద్యోగి. శ్రీమంతుల కుటుంబానికి చెందిన ఐశ్వర్య (సాక్షి వైద్య) అతణ్ణి ప్రేమిస్తుంటుంది. వాళ్లిద్దరికీ వివాహం జరిపించాలనుకున్న ఆమె తండ్రి, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడు. అందుకు కారణం శరవణన్ కి గల అప్పు. సొంత ఇంటికోసం తల్లి చేసిన అప్పు తీర్చడం కోసం, శరవణన్ అవినీతికి పాల్పడటం మొదలుపెడతాడు. ఈ విషయంలో అతనికి 'సదా' సహకరిస్తాడు. ఇద్దరూ కలిసి పెద్ద స్థాయి మోసాలకు శ్రీకారం చుడతారు. ఇక 'మిత్ర' (అన్నా బెన్) నమ్మినవాడి చేతిలో మోసపోతుంది. గర్భవతిగా ఉన్న ఆమె, ఎలాంటి కష్టం చేయలేని స్థితిలో ఉన్న ఆమె .. అవినీతి మార్గాన్ని ఎంచుకుంటుంది. ఇళ్లు లీజ్ కి ఇప్పిస్తానని చెప్పి మోసం చేయడం మొదలుపెడుతుంది. అదే ప్రాంతానికి చెందిన జానకి (వడి ఉక్కరసు),తన కొడుకు 'జాకీ'(యోగిబాబు)తో కలిసి 'ట్రస్ట్' పేరుతో డబ్బులు వసూలు చేస్తూ ఉంటుంది. తాము చేస్తున్నది అన్యాయమని కొడుకు చెబుతున్నా ఆమె వినిపించుకోదు.ఇలా ముగ్గురూ అవినీతి మార్గంలో సంపాదిస్తారు. తమ మోసాలు బయటపడే సమయానికి వేరే ప్రాంతానికి పారిపోయి అక్కడ తలదాచుకుంటారు. ఆ సమయంలోనే 'మిత్ర' కొడుకు కిడ్నాప్ కి గురవుతాడు. కిడ్నాపర్ ఎవరో కాదు ఒకప్పుడు పోలీస్ ఆఫీసర్ గా ఉన్న కల్యాణ సుందరం (నందగోపాల్) అని తెలుసుకుంటారు. ఈ ముగ్గురూ చేసిన మోసాలు ఎలా బయటపడతాయి ? ఒక పోలీస్ ఆఫీసర్ కిడ్నాపర్ గా ఎందుకు



మారతాడు? అవినీతి సొమ్మంతా ఏమైపోతుంది? అనేదే కథ. వితాన్ని ప్రభావితం చేసేవి అవసరాలు .. ఆపదలు.. అలవాట్లు. ఒక మనిషి దారితప్పడంలో ఇవే ప్రధానమైన పాత్రను పోషిస్తాయి. అవసరాలలో నుంచి .. ఆపదలలో నుంచి బయటపడాలంటే డబ్బు కావాలి. అలవాట్లు మానుకోలేని బలహీనతకు డబ్బుకి మించిన మందులేదు. అందువలన ఈజీ మని కోసం అలాంటివాళ్లు అక్రమ మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. అలాంటి వాళ్ల జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం.అందంగా బ్రతకాలి .. అందరి కంటే గొప్పగా బ్రతకాలి అనే ఆశనే మనిషిని పెడత్రోవ పట్టిస్తుంది. మోసం చేసేవాడు డబ్బు పట్ల ఆశతోనే చేస్తాడు. మోసపోయేవాడు డబ్బు పట్ల ఆశతోనే మోసపోతాడు అనే సత్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నాన్ని దర్శకుడు చేసిన తీరు ఆలోచింపజేస్తుంది. పెద్దవాళ్లు తమ 'కల' .. తమ 'ఆశ' .. అంటూ పిల్లలను అప్పుల పాలు చేసి, వాళ్ల చెడు మార్గంలో వెళ్లడానికి కారకులు అవుతున్నారంటూ చెప్పిన విధానం బాగుంది. అప్పులు .. అవస్థలు .. ఈజీమని కోసం నేరం దిశగా అడుగులు ఫస్టాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి. ఆ నేరాలు చేసినందుకు బాధపడుతూ ఇక మారిపోవాలనుకున్న బ్యాచ్ కీ, గతంలో కంటే పెద్ద నేరం చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనే దిశగా సెకండాఫ్ కొనసాగుతుంది. దర్శకుడు అల్లుకున్న కథ .. వేసుకున్న స్క్రీన్ ప్లే .. ప్రధానమైన నాలుగు పాత్రలను మలిచిన విధానం ఈ సినిమాకి హైలైట్ గా చెప్పుకోవచ్చు. ఈ కంటెంట్ లో కథనే హీరో. పరిస్థితులను బట్టి పాత్రలు పరిగెడుతూ ఉంటాయి .. సందర్భాన్ని బట్టి ప్రవర్తిస్తూ ఉంటాయి. అర్జున్ దాస్ మార్క్ ను చూపించాడనికి గానీ .. యోగిబాబు మార్కును చూపించడానికి గాని దర్శకుడు ప్రయత్నించలేదు. పరిస్థితులకు తగినట్టుగానే ఆ పాత్రలు ప్రవర్తిస్తాయి. సన్నివేశాలు కూడా సహజత్వాన్ని దాటుకుని వెళ్లకపోవడం మనం గమనించవచ్చు. అందరూ తమ పాత్రలలో ఒదిగిపోయారు. ఎవరూ కూడా నటిస్తున్నట్టుగా ఉండదు. అరవింద్ విశ్వనాథన్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ నేపథ్య సంగీతం .. అరుళ్ మోసెస్ ఎడిటింగ్ పెర్ఫెక్ట్ గా అనిపిస్తాయి.

# విద్యార్థులకు అండగా నటి జ్యోతిక కేంద్ర మంత్రి రాజీనామాకు డిమాండ్



దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) లీక్ వివాదంపై ప్రముఖ నటి జ్యోతిక స్పందించారు. విద్యార్థులు చేస్తున్న నిరసనలకు ఆమె సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.నీట్ పరీక్ష నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని, ప్రశ్నపత్రం లీక్ అయిందని ఆరోపిస్తూ దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాలు, యువజన బృందాలు ఆందోళనలు చేస్తున్నాయి. ఇటీవలే ఢిల్లీలో జరిగిన 'సంసద్ చలో' మార్చ్‌తో ఈ నిరసనలు మరింత ఉద్ధృతమయ్యాయి.'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) మద్దతుతో వేలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకొని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష నేతలు, విద్యావేత్తలు, సినీ ప్రముఖుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.ఈ నేపథ్యంలో జ్యోతిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా నిరసనకా రులకు సంఘీభావం తెలిపారు. "ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకోండి.. రాజీనామా చేయండి. నేను విద్యార్థులకు, మన దేశ భవిష్యత్తుకు అండగా నిలబడతాను. ప్రజాస్వామ్య భారతదేశం, విద్యా సంస్కరణలకు కట్టుబడి ఉన్నాను" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ప్రస్తుత తరం యువత (జెన్-జెడ్) నిర్భయంగా, పారదర్శకంగా తమ గళం విప్పుతోందని, వారిని చూసి గర్విస్తున్నామని జ్యోతిక అన్నారు. ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తున్న సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్‌తో పాటు విద్యా సంస్కరణల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌లను ఆమె ప్రశంసించారు. "తల్లులుగా, మా పిల్లలను మీలా పెంచాలని కోరుకుంటున్నాం. మమ్మల్ని నిర్భయంగా మార్చినందుకు సీజేపీకి ధన్యవాదాలు" అని ఆమె రాసుకొచ్చారు. తమిళనాడులో చాలా ఏళ్లుగా నీట్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు జ్యోతిక ప్రకటనతో ఈ నిరసనలకు మరింత బలం చేకూరి నట్లయింది. ఇప్పటికే రాజకీయ నాయకులు, నటులు, విద్యావేత్తలు, పౌర సమాజ ప్రతినిధులు నీట్ పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురా వాలని, పారదర్శకత పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. జ్యోతిక ప్రకటన ఈ డిమాండ్లకు మరింత ఊతమిచ్చింది.

## నార్త్, సౌత్ పరిశ్రమల తేడాల పై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు!

సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా... ఇటీవల 'ఫోర్బ్స్' ఇంటర్వ్యూలో ఉత్తరాది, దక్షిణాది చిత్ర పరిశ్రమల పనితీరుపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. హిందీ సినిమాల్లో నటీనటులకు వైవిధ్యమైన పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని, కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల ద్వారా తమ ప్రతిభను చాటుకునే అవకాశం దక్కుతుందని ఆమె తెలిపారు. అదే సమయంలో దక్షిణాది చిత్రసీమ వాతావరణం భిన్నంగా ఉంటుందని వివరించారు. సౌత్ పరిశ్రమలో వాణిజ్య (కమర్షియల్) అంశాలకు, స్టార్ క్వాలిటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, కొందరు దీనిని పురుషాధిక్యతగా భావించినప్పటికీ తన దృష్టిలో అది కేవలం అక్కడి కమర్షియల్ సినిమా వ్యవస్థ అని స్పష్టం చేశారు. వీటిని విమర్శలుగా చూడకూడదని, ఇది తన వ్యక్తిగత అనుభవమని చెబుతూ... ఇండస్ట్రీలో సుదీర్ఘకాలం నిలదొక్కుకోవాలంటే కమర్షియల్, కథా ప్రాధాన్యమున్న పాత్రల మధ్య సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని చెప్పారు.కాగా, ఇటీవల హిందీలో వచ్చిన 'స్త్రీ 2' చిత్రంలోని 'ఆజ్ కీ రాత్' పాట యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్‌కు పైగా వ్యూస్ సాధించి రికార్డు సృష్టించడంతో తమన్నా జాతీయ స్థాయిలో మరోసారి విశేష గుర్తింపు సాధించారు. ప్రస్తుతం సౌత్, నార్త్ సినీ పరిశ్రమల పనితీరుపై తమన్నా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.